## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

మనిషిమీద యలక మరచిపో త్వరగాను
మనసులోన మనకు పనికిరాదు
మనిషులుండబోరు మనతోడనెప్పుడు
మనసుమాత్రమెపుడు మనదు వెంట

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 364 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 30 ఏప్రిల్ 2026 | 28-04-2026 పేజీలు-8


## టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయి



- ఫలితాల్లో 95.15 శాతం ఉత్తీర్ణ
- బాలికలు 96.26 శాతం, బాలురు 94.07
- సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం పాస్
- 5,731 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత
- ములుగు ఫస్ట్...హైదరాబాద్ లాస్ట్

హైదరాబాద్ ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రాష్ట్రంలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 2.19 శాతం అధిక ఉత్తీర్ణతతో బాలుర కంటే బాలికలుపై చేయి సాధించారు. బాలికలు 96.26 శాతం, బాలురు 94.07 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పాఠశాలల యాజమాన్యాల వారీగా చూస్తే -మిగతా 2 లో

## హెడ్, క్లాసెన్ మ్యాజిక్..

### ముంబైపై రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన సన్‌రైజర్స్

- ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ వరుసగా ఐదో విక్టరీ
- ముంబై ఇండియన్స్‌పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం
- 244 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన ఆరెంజ్ ఆర్మీ



న్యూఢిల్లీ ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగుతోంది. వాంఖడేలో ముంబైని ఓడించి.. ఈ టోర్నీలో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసింది. దీంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ముంబై ఇండియన్స్‌తో మ్యాచులో రికార్డు స్థాయిలో -మిగతా 2 లో

## 150 మీటర్ల ఎత్తులో తుమ్మిడి హట్టి

### మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిదే

- 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రకు సమస్యరాదు
- ముంపు వాటిల్లితే పరిహారానికి ప్రభుత్వం సిద్ధం
- సమన్వయం బాధ్యత ఉత్తమ్‌కు అప్పగింత
- నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- ఆదిలాబాద్‌తో పాటు రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలకు సాగు, తాగు నీరు : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తుమ్మిడిహట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. -మిగతా 2 లో





## పశ్చిమబెంగాల్‌లో పోటెత్తిన ఓటర్లు

- రెండో విడతలో 91 శాతానికిపైగా పోలింగ్
- పలుచోట్ల చెదురుమదురు ఘటనలు
- మొరాయించిన ఈవీఎంలు మే 4న తుది ఫలితాలు

కోల్‌కతా
పశ్చిమ బెంగాల్‌లో ఓటేసేందుకు ఓటర్లు పోటెత్తారు. దీంతో రెండో విడతలో 91 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. కొన్ని చోట్ల చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం గా ముగిసింది. మరికొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. పశ్చిమబెంగాల్‌లో 294 స్థానాలు ఉండగా మొదటి విడతలో 152 నియోజకవర్గాలకు ఏప్రిల్ 23న పోలింగ్ జరిగింది. ఇందులో 93 శాతం ఓటింగ్ నమోదైంది. బుధవారం రెండోవిడతలో 142 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో 1,448మంది అభ్యర్థులు బరిలో నిల్చోగా 3.21 కోట్ల మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని నిక్షిప్తం చేశారు. ఇందుకోసం 41వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఈసీ ఏర్పాటు చేసింది.

బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ నేపథ్యంలో ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. భవానీపుర్ నియోజకవర్గంలో సీఎం మమతా బెనర్జీ తన ఓటు హక్కును వినియోగించున్నారు. -మిగతా 2 లో

## అధికారం రావడం.. పోవడం రొటీన్ వ్యవహారం

- హామీలు గుప్పించి..ప్రజలను మోసం చేస్తున్న రేవంత్
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం అవుతామని కేసీఆర్ ఆనాడే హెచ్చరించారు
- రేవంత్‌తో నాకేమీ వ్యక్తిగత పంచాయితీ లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
అధికారం రావడం పోవడం రొటీన్‌గా జరిగే తంతు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ ,మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించడం లేదని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాయినింగ్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. అధికారం తమకు కొత్తేం కాదని వెల్లడించారు. మొన్ననే తమ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకుందని గుర్తు చేశారు. -మిగతా 2 లో



## ఎన్‌డీయే కూటమి హ్యాట్రిక్..

- అసోంలో మళ్లీ విజయం అధికార ఎన్‌డీయేదే

2

## అమరావతిలో ఫైనాన్స్ సిటీ

- సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ స్థానంలో నిర్మాణం
- ఆదాయార్జనే లక్ష్యం
- త్వరలో అధికారిక ప్రకటన

అమరావతి ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రాజధాని అమరావతిలో సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ స్థానంలో ఫైనాన్స్ సిటీని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి సంబంధించి ఇప్పటికే వివిధ దేశాలకు సంబంధించిన సంస్థలతో సంప్రదింపులు జరిపి, ప్రాథమిక ప్లానింగ్ రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఫైనాన్స్ సిటీ నిర్మాణం గురించి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ -మిగతా 2 లో




## తండ్రికి విలువ ఇవ్వని కవిత... అమ్మ ఎలా అవుతుంది

- అన్నమీద కోపంతో తండ్రిని తిడితే ఎలా
- ఎంతయినా కేసీఆర్ ఉద్యమకారుడు కదా
- కేసీఆర్ లేకుంటే కవిత ఎక్కడ ఉండేవారు
- లిక్కర్ కేసులో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదు
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



యాదాద్రిభువనగిరి,
తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కవితను ఉద్దేశించి ప్రశ్నించారు. తన అన్న మీద ఉన్న కోపాన్ని తండ్రి మీద చూపడం తప్పన్నారు. ఈ మేరకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవితపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కవిత పార్టీ పెట్టడం.. అది కూడా టీఆర్ఎస్ పేరు మీదనే పార్టీ పెట్టడం హాస్యాస్పదమన్నారు. కూతురికి తండ్రి -మిగతా 2 లో



## ప్రజాదరణ కోల్పోతున్న ట్రంప్

- ఇరాన్ యుద్ధం, గ్యాస్ ధరల పెరుగుదలపై ప్రజాగ్రహం
- రిపబ్లికన్లలోనూ వ్యతిరేకత

వాషింగ్టన్ :
అమెరికా అధ్యక్షులుగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత డోనాల్డ్ ట్రంప్ మున్నెన్నడూ లేని విధంగా ప్రజాదరణ కోల్పోయారు. నాలుగు రోజుల పాటు రాయిటర్స్/ఇప్సోస్ నిర్వహించిన తాజా పోల్‌లో కేవలం 34 శాతం మంది మాత్రమే ట్రంప్ పనితీరును సమర్థించారు. ఈ సర్వేకు ముందు ఈ నెల 15-20 తేదీల మధ్య జరిగిన మరో పోల్‌లో ఆయనకు 36 శాతం మంది మద్దతు తెలిపారు. గత జనవరిలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో ఆయనను 47 శాతం మంది సమర్థించడం గమనార్హం. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయిల్ దళాలు ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించిన తర్వాత ట్రంప్ రేటింగ్ మరింత దిగజారింది. యుద్ధం కారణంగా గ్యాసోలిన్ ధరలు బాగా పెరిగాయి. ప్రజల జీవన వ్యయానికి సంబంధించి ట్రంప్ పనితీరును కేవలం 22 శాతం మంది మాత్రమే సమర్థించారు. రాయిటర్స్/ఇప్సోస్ సర్వేకు ముందు ఈ రేటింగ్ పాతిక శాతంగా ఉంది. జీవన వ్యయంపై అడిగిన ప్రశ్నకు రిపబ్లికన్లు సైతం ట్రంప్ పనితీరుపై పెదవి విరిచారు. 41 శాతం మంది ఆయనను వ్యతిరేకించారు. ట్రంప్ హయాంలో జీవన వ్యయం పెరిగిందని తటస్థులలో 71 శాతం మంది అభిప్రాయపడ్డారు.

-మిగతా 2 లో

## రాష్ట్రంలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు

### 90 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం



- 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మిల్లులకు చేరిన 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోలు పక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా సాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, -మిగతా 2 లో

## ఇకపై మంచిగా ఉండను.. మరింత దూకుడుగా వెళ్తా..

- ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్



2

# టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

మొదటి తరువాయి

సాంఘిక సంక్షేమ గురుకులాలు 99.10శాతం ఉత్తీర్ణతతో అగ్రగామి గా నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 86.18 శాతం నమోదు కాగా ప్రయివేటు పాఠశాలల్లో 95.81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,731 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదవ్వగా, ఆరు ప్రయివేటు పాఠశాలల్లో 0 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా 99.30 శాతంతో ము లుగు జిల్లా మొదటి స్థానంలో నిలువ గా, అత్యల్పంగా 89.23 శాతంతో హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్, ప్రభుత్వ పరీక్షల సంచాలకు లు పి.వి.శ్రీహరి, ఎస్సీఈఆర్టీ సంచాలకులు రమేశ్‌తో కలిసి ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు బుధవారం పదో తరగతి పరీక్షా ఫలితాలను విడుదల చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 5,26,166 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 4,97,312 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో తెలుగు మీడియంలో 89.14 శాతం, ఇంగ్లీష్ మీడియంలో 95.86 శాతం, ఉర్దూ మీడియంలో 86.71 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

**రీ కౌంటింగ్, వెరిఫికేషన్‌కు దరఖాస్తుల స్వీకరణ**

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు నేటి నుంచి మే 14 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మార్కుల రీ కౌంటింగ్‌కు రూ. 500, రీ వెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. కాగా జూన్ 5 నుంచి 12 వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిం చనున్నారు. కాగా మే14వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారు. అయితే ఆయా సబ్జెక్ట్ పరీక్షకు రెండు రోజుల ముందు వరకు రూ.50 ఆలస్య రుసుముతో ఫీజును చెల్లించేందుకు అవకాశం ఉంది.

# హెడ్, క్లాసెన్ మ్యాజిక్..

మొదటి తరువాయి

244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి.. ఈ ఫీట్ సాధించింది. సన్ రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ హాఫ్ సెంచరీలతో జట్టును గెలిపించారు. ఇక ఈ టోర్నీలో ఆరో ఓటమిని నమోదు చేసిన ముంబై ఇండియన్స్.. ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ భారీ స్కోరు చేసింది. ర్యాన్ రికల్టన్ అజేయ సెంచరీ (55 బంతుల్లో 123 రన్స్ నాటౌట్)తో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 243/5 పరుగులు చేసింది. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన సన్ రైజర్స్ హైదరాబాద్.. ముంబై బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయని.. ట్రావిస్ హెడ్ ముంబై బౌలర్లకు చుక్కలు చూపించాడు. 30 బంతుల్లోనే ఏకంగా 8 సిక్సర్లు, 4 ఫోర్లతో 76 పరుగులు స్కోరు చేశాడు. అభిషేక్ శర్మ 24 బంతుల్లో 45 రన్స్‌తో బ్యాట్ ఝుళిపించడంతో సన్ రైజర్స్.. లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. పవర్ ప్లే ముగిసే సరికి 92/0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది.ఓపెనర్లు ఇద్దరూ ఔట్ అయిన తర్వాత జట్టును గెలిపించే బాధ్యతను హెన్రిచ్ క్లాసెన్ తీసుకున్నాడు. ఓ దశలో తొలి వికెట్‌కు 129 పరుగుల భాగస్వామ్యం వచ్చిన తర్వాత.. సన్ రైజర్స్ స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయింది. కేవలం ఏడు బంతుల వ్యవధిలో ఓపెనర్లతో పాటు ఇషాన్ కిషన్ వికెట్‌ను సైతం కోల్పోయింది. ఈ సమయంలో ముంబై.. ఒత్తిడి పెంచాలని భావించింది. కానీ హెన్రిచ్ క్లాసెన్.. ముంబైకి, సన్ రైజర్స్‌కు మధ్య అడ్డుగోడలా నిలబడ్డాడు. సాధించాల్సిన రన్ రేట్‌కు తగ్గట్లుగా బ్యాటింగ్ చేస్తూ.. జట్టును విజయతీరాలకు చేర్చాడు.క్లాసెన్ 30 బంతుల్లో 65 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. సలీల్ అరోరా సైతం 10 బంతుల్లో 30 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో 18.4 ఓవర్లలో సన్ రైజర్స్.. 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 244 పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేసింది. ఈ విజయంతో సన్ రైజర్స్ హైదరాబాద్ పాయింట్స్ టేబుల్‌లో మూడో ప్లేసుకు చేరింది. ముంబై ఆరో ఓటమితో 9వ ప్లేసులో కొనసాగుతోంది.

# ఎన్‌డీయే కూటమి హ్యాట్రిక్..

**అసోంలో మళ్లీ విజయం అధికార ఎన్‌డీయేదే**



న్యూఢిల్లీ

అసోంకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. అనేక సంస్థల అంచనా ప్రకారం అసోంలో బీజేపీ ఆధ్వర్యంలోని అధికార ఎన్‌డీయే కూటమిదే మళ్లీ విజయం. అసోంలో ఇప్పటివరకు బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయేనే అధికారంలో ఉంది. హిమంత బిశ్వ శర్మ సీఎంగా కొనసాగుతున్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ఆయన ఆధ్వర్యంలోనే ఎన్‌డీయే విజయం సాధించబోతుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చెబుతున్నాయి.అసోంలో 126 అసెంబ్లీ సీట్లు ఉండగా, 64 సీట్లు సాధిస్తే అధికారం సాధ్యం. తాజా అంచనాలివి. మ్యాట్రిక్స్ అంచనా ప్రకారం బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయేకు 88--98 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 22--32 సీట్లు, ఇతరులకు 3--5 సీట్లు, చాణక్య స్ట్రాటజీస్ అంచనా ప్రకారం ఎన్‌డీయేకు 85--95 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 25--32 సీట్లు, ఇతరులకు 6--12 సీట్లు, పోల్ డైరీ అంచనా ప్రకారం ఎన్‌డీయేకు 88--101 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 15--26 సీట్లు, ఇతరులకు 3--7 సీట్లు, యాక్సిస్ మై ఇండియా సంస్థ అంచనా ప్రకారం ఎన్‌డీయేకు 88--100 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 24--36 సీట్లు వచ్చే అవకాశాలున్నాయి. అన్నింట్లోనూ బీజేపీ కూటమి ఘన విజయం ఖాయంగా కనిపిస్తోంది. వరుసగా రెండు సార్లు విజయం సాధించిన ఎన్‌డీయే కూటమి అసోంలో మరోసారి అధికారం దక్కించుకుని హ్యాట్రిక్ కొట్టడం ఖాయమనేది అంచనా.

# ప్రజాదరణ కోల్పోతున్న ట్రంప్

మొదటి తరువాయి

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దళాలు యుద్ధం ప్రారంభించిన తర్వాత గ్యాసోలిన్ ధరలు ఏకంగా 40 శాతం పెరిగి గ్యాలన్‌కు 4.18డాలర్లకు చేరాయి. ధరల పెరుగుదల అమెరికా కుటుంబాలపై పెను భారం మోపింది. నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలలో అమెరికా ప్రతినిధి సభపై పట్టు కోల్పోతామేమోనని రిపబ్లికన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిపబ్లికన్లలో మాత్రం ఇప్పటికే ట్రంప్‌ను 78 శాతం మంది వెనకేసుకొస్తున్నారు. అయితే జీవనవ్యయాన్ని అదుపు చేయడంలో ట్రంప్ విఫలమయ్యారని 41 శాతం మంది రిపబ్లికన్లు అభిప్రాయపడడం గమనార్హం. మధ్యంతర ఎన్నికలలో నిర్ణయాత్మక పాత్ర పోషించే స్వతంత్ర ఓటర్లు ఇప్పుడు డెమొక్రాట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో 20 శాతం మంది తటస్థులు డెమొక్రాట్లను సమర్థిస్తే తాజాగా అది 34 శాతానికి పెరిగింది. ప్రతి నలుగురు స్వతంత్ర ఓటర్లలో ఒకరు ఇప్పటికీ ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉన్నారు. ధరలను అదుపులోకి తెస్తానన్న హామీతో 2024 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి ఇప్పుడు ట్రంప్‌ను సమర్థిస్తున్న వారి సంఖ్య కేవలం 27 శాతం మాత్రమే. 2017-2021 మధ్య ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించినప్పుడు ఆయన రేటింగ్ ఇంత దారుణంగా పడిపోయిన సందర్భం లేదు. అత్యంత బలహీనమైన బైడెన్ ఆర్థిక రేటింగ్ కంటే ఇది తక్కువగా ఉంది.

## పశ్చిమబెంగాల్‌లో
# పోటెత్తిన ఓటర్లు

మొదటి తరువాయి

టీఎంసీ ఎంపీలు మహువా మెయిత్రా, అభిషేక్ బెనర్జీ, బీజేపీ నేత, నటుడు మిథున్ చక్రవర్తి, మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ సహా పలువురు ప్రముఖులు ఓటేశారు. రెండోవిడతలో పోటీ పడుతున్న కీలక అభ్యర్థుల్లో సీఎం మమతాబెనర్జీ, ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఉన్నారు. భవానీపూర్ నియోజకవర్గంలో మమతపై సువేందు అధికారిని బీజేపీ పోటీకి నిలిపింది. భాత్ పాడా, రాణాఘాట్, కోల్‌కతా ఉత్తర్, కోల్‌కతా దక్షిణ్, రాశ్ బెహారీ, జాధవ్ పుర్, బాలీగంజ్‌లు రెండో దశలో కీలకంగా ఉన్నాయి

# 150 మీటర్ల ఎత్తులో తుమ్మిడి హట్టి

మొదటి తరువాయి



గతంలో జరిగిన చర్చల ప్రకారం 148 మీటర్ల ఎత్తు నిర్మించేందుకు మహారాష్ట్ర అంగీకరించిందనీ, 152 మీటర్ల ఎత్తు నిర్మిస్తే మహారాష్ట్ర పరిధిలో ముంపు ప్రభావం ఉంటుందనీ, మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తు నిర్మిస్తే తక్కువ ఖర్చుతో నీటిని తీసుకునే వీలుందని ఈ సందర్భంగా ఇంజినీరింగ్ నిపుణులు సీఎంకు తెలిపారు. బ్యారేజ్ నిర్మాణంతో ఆదిలాబాద్‌తో పాటు తెలంగాణలోని మెట్ట ప్రాంతాల రైతులకు సాగు, తాగు నీరందుతుందన్నారు. అలాగే తక్కువ ఖర్చుతో గ్రావిటీపై శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించే వీలుంటుందని సీఎం చెప్పారు. ప్రాజెక్ట్ ప్రాధాన్యత దృష్ట్యా మహారాష్ట్రతో వెంటనే సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రభావం ఉండదనీ, ఎక్కడైనా ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నందున ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వెంటనే లేఖ రాయాలని సూచించారు. గురువారం కేంద్ర మంత్రి సమయం తీసుకుని నేరుగా కలిసి చర్చించే బాధ్యతను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి అప్పగించారు, తుమ్మిడిహెట్టి బ్యారేజ్ అవసరం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కిషన్‌రెడ్డికి తెలంగాణ రైతుల పక్షాన విజ్ఞప్తి చేయాలన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా చేపడుతున్న జియో టెస్టింగ్ పనులను వర్షాకాలంలోపు వేగంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను సీఎం ఆదేశించారు.

**నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

తుమ్మిడిహట్టి బ్యారేజ్ ఎంత ఎత్తున నిర్మించాలి.. ఎంత ఎత్తు నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే వీలుంటుందని ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ మీద ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం దాదాపు రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిందనీ, కొన్ని చోట్ల కాల్వల నిర్మాణం కూడా జరిగిందని అన్నారు. 71.5 కిలోమీటర్ల కెనాల్ పనులు జరిగాయని అధికారులు తెలిపారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల నీటిని వినియోగించుకునే వీలుంటుందనీ, తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయని తెలిపారు. ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలన్నింటినీ సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, ఈఎన్సీ శ్రీధర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అధికారం రావడం..పోవడం రొటీన్ వ్యవహారం

మొదటి తరువాయి

తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతోపాటు బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయని చెప్పారు. అధికారంలోకి రాకుంటే కొంపలు అంటుకుపోతాయి అనుకోవద్దని నేతలకు సూచించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పారని.. తొందరపడకండి ఆగమై ఓటు వేయకండి అని కేసీఆర్ కల్వకుర్తిలో చెప్పిన మాటలను గుర్తు చేశారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చే సమయంలో ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.. పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారు అంటూ అడిగారన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధు మాత్రం కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. చాలా నియోజక వర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు ఈ ఎమ్మెల్యే మాకొద్దు అనుకుని తమ ఎమ్మెల్యేలను ఓడగొట్టారని కేటీఆర్ అన్నారు. అలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని తెలిపారు. తర్వాత మనకు చాలా షాక్‌లు తగిలాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఆ తర్వాత కేసీఆర్‌కి రెండోసారి ఫ్రాక్చర్ జరిగింది. మన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారి వెళ్లిపోయారు. ఇక రేవంత్ రెడ్డి మీద నాకు గెట్టు పంచాయతీ లేదు. ఇంకా వేరే గొడవ ఏమీ లేదు. కానీ ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వాళ్లు జనాలను మోసం చేశారు. అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోతుందని కేసీఆర్ చెప్పారు. కానీ మనం వినలేదు. ఎన్నికల ముందు కల్వకుర్తిలో సర్వే చేయించాం. మన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఓడిపోతాడని క్లియర్‌గా చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్నారు కాబట్టి అధికార మార్పిడి కావాలని చాలా మంది జనాలు భావించారని కేటీఆర్ వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని కేటీఆర్ వెల్లడించారు.

# తండ్రికి విలువ ఇవ్వని కవిత...అమ్మ ఎలా అవుతుంది

మొదటి తరువాయి

అంటే ప్రేమ ఉండాలని.. కానీ కవిత తన మొదటి సమావేశంలో తండ్రిని తిట్టి మర్యాద పోగొట్టుకున్నారని అన్నారు. ఉద్యమకారుడు కేసీఆర్‌ను తిట్టడం తనకు బాధేసిందని తెలిపారు. మద్యం కుంభకోణంలో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని.. కేసు పూర్తి కాలేదని ఎమ్మెల్యే తెలిపారు. డబ్బులు ఉన్నాయని పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టేంత సులువైందన్నారు. మంత్రి పదవిపై అధిష్ఠానం తనకు హామీ ఇచ్చిందని... మాట నిలబెట్టుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్ విస్తరణ ఉండొచ్చని తెలిపారు. మంత్రి పదవి ఇస్తే మరింత కష్టపడి పనిచేస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు, రాజకీయ చర్యలపై స్పందిస్తూ ఆయన పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కవిత పార్టీ ఏర్పాటు విషయాన్ని రాజగోపాల్ రెడ్డి 'బిగ్ జోక్'గా అభివర్ణించారు. అదే విధంగా టిఆర్ఎస్ పేరుతో పార్టీ పెట్టడం మరో జోక్ అని వ్యాఖ్యానించారు. కవితకు ఉన్న గుర్తింపు కేవలం ఒక ఉద్యమకారుడు బిడ్డగా మాత్రమేనని, ఆమె స్వతంత్ర రాజకీయ నాయకత్వం ఇంకా నిరూపించుకోలేదని అన్నారు. మొదటి సమావేశంలోనే తన తండ్రి అయిన కేసీఆర్‌ను విమర్శించడం సరైంది కాదని రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తండ్రిపై గౌరవం, ప్రేమ ఉండాలని, అలాంటి విలువలు లేకపోతే ఆమె వ్యక్తిత్వం ప్రశ్నార్థకమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందిఅంటూ ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే కవిత అన్నపై ఉన్న కోపాన్ని తండ్రిపై చూపడం సరికాదని అన్నారు. కుటుంబ సమస్యలను రాజకీయ వేదికపైకి తీసుకురావడం సరైన పద్ధతి కాదని ఆయన సూచించారు. కవితపై ఉన్న మద్యం కుంభకోణం ఆరోపణల విషయమై.. ఆమెకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని, నిర్దోషి అని తేలలేదని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం డబ్బులు ఉన్నాయనే కారణంతో పార్టీ పెట్టడం అంత సులువు కాదని, అది పాన్ షాప్ పెట్టినంత ఈజీ కాదని వ్యాఖ్యానించారు. తనంతట తాను పోటీ చేసినా కవితకు డిపాజిట్ కూడా రాదని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. ఇక తన రాజకీయ భవిష్యత్తుపై మాట్లాడుతూ, అధిష్ఠానం తనకు పెద్ద పదవి ఇస్తే ఆ బాధ్యతను న్యాయంగా నిర్వహిస్తానని తెలిపారు. బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయంలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# రాష్ట్రంలో జోరుగా ధాన్యం కొనుగోళ్లు

మొదటి తరువాయి

ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623, వివిధ సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు నడుస్తున్నాయి. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 6,500 లారీలను సిద్ధం చేశారు. ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. ధాన్యం నిల్వ కోసం ముందస్తుగా 20 కోట్ల గన్నీ సంచులను సిద్ధంగా ఉంచారు. ఇప్పటివరకు రూ. 2,031 కోట్ల విలువైన 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రైతులకు ఇప్పటికే రూ. 323 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. 3.46 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయడం ద్వారా 64,779 మంది రైతులకు లబ్ది చేకూరింది. అలాగే, 30,220 మెట్రిక్ టన్నుల సెనగ కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యిందని అన్నారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను నెలకొల్పింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించేందుకు నిరుటి కంటే ఈసారి కేంద్రాల సంఖ్యను పెంచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన 8,525 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623 కేంద్రాలు, సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు, ఇతర సహకార సంస్థల ద్వారా 353 కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో దాదాపు 43,000 మంది శిక్షణ పొందిన సిబ్బంది కొనుగోళ్లలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు మంగళవారం నాటికి సుమారు 8.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు పూర్తయింది. కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యంలో దొడ్డు, సన్న రకాలుగా విభజించి సేకరణ కొనసాగుతోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6,500 లారీలను అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం మిల్లులకు తరలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఆటోమేటెడ్ డ్రైయర్లు, క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు. అదనంగా, సుమారు 20 కోట్ల గన్నీ సంచులు ముందుగానే నిల్వ ఉంచారు, తద్వారా కొనుగోళ్లు ఎక్కడా నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.2031 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా.. ఇప్పటికే దాదాపు రూ.323 కోట్లు రైతులకు చెల్లించారు. వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ధాన్యంతో పాటు రాష్ట్రంలో ఇతర పంటల కొనుగోళ్లు కూడా కొనసాగు తున్నాయి. ఈసారి 43.20 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనాలున్నాయి. ఇప్పటివరకు 3.46 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిగాయి. దాదాపు రూ.830.69 కోట్ల విలువైన కొనుగోళ్లతో 64,779 మంది రైతులు లబ్ది పొందారు. 1.25 లక్షల మెట్రిక్ టన్నుల సెనగ పంట దిగుబడి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు 30,220 మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగింది. దీనివల్ల 15,933 మంది రైతులు లబ్ది పొందారు. పొద్దుతిరుగుడు పంటకు 19,808 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేయగా, ఇప్పటివరకు 3,492 మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తయింది. 2,512 మంది రైతుల నుంచి కొనుగోళ్లు జరిగాయి. అన్ని జిల్లాల్లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా కొనసాగుతున్నాయి. రైతులకు కనీస మద్దతు ధర అందించటంతో పాటు సౌకర్యవంతమైన సేవలు, తక్షణ చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

# ఇకపై మంచిగా ఉండను.. మరింత దూకుడుగా వెళ్తా..

**ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్**



న్యూఢిల్లీ

అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోకుండా ఆలస్యం చేస్తున్న ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై తాను మంచిగా ఉండబోనంటూ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం తన సోషల్ మీడియా ట్రూత్ వేదికగా తన ప్రత్యేక ఫొటోను పంచుకున్నారు. దానిపై 'నో మోర్ మిస్టర్ నైస్ గై' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. అంటే, ఇకపై తాను మంచివాడికి కాను అంటూ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అణు నిరాయుధీకరణ ఒప్పందంపై ఇరాన్ నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని, అమెరికా మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ఇరాన్ ఈ విషయంలో తెలివిగా వ్యవహరించాలన్నారు. చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోందని, అణు ఒప్పందం విషయంలో ఎలా వ్యవహరించాలో వారికి తెలియడం లేదని ట్రంప్ అన్నారు. అణు ఒప్పందం విషయంలో ఇరాన్‌కు కొత్త ప్రతిపాదనలు చేసినట్లు ట్రంప్ వెల్లడించారు. వాటిని అంగీకరించాలని సూచించారు. ఇరాన్--అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ చర్చలు మాత్రం కొనసాగడం లేదు. అణు ఒప్పందం అంశంలో ప్రతిష్టంభన నెలకొంది. మరోవైపు హోర్ముజ్‌ను అమెరికా దిగ్బంధించింది. ఈ జలసంధి నుంచి నౌకల రవాణాను ఇరాన్ కూడా అడ్డుకుంటోంది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు జరిగి, హోర్ముజ్ జలసంధి తెరుచుకోవాలని ప్రపంచ దేశాలు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు తాజా పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ మద్దతు కోరేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. సెయింట్ పీటర్స్ బర్గ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమైనట్లు తెలుస్తోంది.

# అమరావతిలో ఫైనాన్స్ సిటీ

మొదటి తరువాయి

సమాచారం ప్రకారం నూతనంగా నిర్మిస్తున్న రాజధాని నగరానికి ఆదాయార్జనే లక్ష్యంగా ఫైనాన్స్ సిటీ నిర్మాణం ఉండనుంది. దీనిలో భాగంగా 1690 ఎకరాల్లో హైరైజ్ భవనాలు నిర్మించి, వాటిలో వివిధ కార్పొరేట్ సంస్థల కార్యాలయాలు ఏర్పాటు అయ్యేలా చూడటం, వాటి కార్యకలాపాల ద్వారా నగరానికి ఆదాయాన్ని సంపాదించడం ప్రభుత్వ లక్ష్యమని చెబుతున్నారు. హైరైజ్ భవనాలను ఐదు రకాలుగా నిర్మించాలని, వాటిని నేరుగా విక్రయించడం, లీజుకివ్వడం ద్వారా ఆదాయాన్ని రాబట్టుకోవచ్చని భావిస్తున్నారు. అలాగే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం ద్వారా ఇక్కడ భూమి విలువ కూడా మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. అయితే, ఎంత పెట్టుబడి పెట్టాలి. గతంలో మాదిరిగా ఒప్పందం చేసుకోవాలా, లేక సిఆర్డిఏ ఆధ్వర్యాన నిర్మించి ఇవ్వడం ద్వారా ఆదాయం రాబట్టుకోవాలా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ నిర్మాణం కోసం సింగపూర్ కు చెందిన సుర్బానా జురాంగ్ కన్సార్టియానికి 1694 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. 2019లో ప్రభుత్వం మారడంతో స్విస్ ఛాలెంజ్ ఒప్పందాన్ని అప్పటి ప్రభుత్వం రద్దు చేసుకోవడంతోపాటు ఒప్పందంలో అవినీతి ఉందనే పేరుతో పోలీసులు సింగపూర్ వెళ్లి విచారణ జరిపారు. దీన్ని అవమానంగా భావించిన సింగపూర్ ప్రతినిధులు ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. 2024లో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం సింగపూర్ ప్రతినిధులతో ఆ ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు పలు దఫాలు చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోవడంతో దాని స్థానంలో ఫైనాన్స్ సిటీని నిర్మించాలని నిర్ణయించారు.

# ఘనంగా శ్రీ సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**గంగాధర, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటాయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు కార్యక్రమంగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగింది. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, యాగశాల కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. ఆలయ ప్రాంగణంలో గజస్థంభం ఏర్పాటును సంప్రదాయబద్ధంగా పూర్తి చేసి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్తులు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని దర్శించారు. జైశ్రీరామ్



నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగగా, మహిళలు మంగళహారతులతో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ఈ ఆలయం గ్రామానికి ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని, భక్తుల సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా జరుగుతున్నాయని తెలిపారు.

## ఎంపీ నిధుల పోరండ్లలో దేవాలయానికి బోర్ వెల్ ఏర్పాటు



**తిమ్మాపూర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలోని పెద్దగుట్ట శ్రీ వీరబ్రహ్మేంద్ర సమేత లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ అవసరాల కోసం ఎంపీ నిధులతో బోర్ వెల్ ఏర్పాటు చేశారు. కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిధులతో ఈ పనులు చేపట్టగా, పోరండ్ల సర్పంచ్ అసోద శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి బోర్ వెల్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీలం ఓదేలు, వార్డు సభ్యులు గడ్డం రమేష్, పార్నంది అనూష రాజు, కిన్నెర భూమయ్య, అసోద రాజయ్య, బత్తిని రమ్య శ్రీకాంత్, నాంపల్లి సత్తయ్య, మాజీ ఎంపీటీసీ తొడెంగ కొమురయ్య, బిజెపి మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్, నాయకులు కిన్నెర అనిల్ కుమార్, వేల్పుల ఓదేలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు దేవాలయానికి బోర్ వెల్ ఏర్పాటు చేసినందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## డబుల్ రోడ్డు పనులు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు



**గన్నేరువరం, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం--పొత్తూరు డబుల్ రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా మారి, ప్రతి రోజు వాహనదారులు, రైతులు నరకయాతన అనుభవిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం బస్తాలతో లారీలు నడపడం కష్టసాధ్యమైందని, గుంతలు, దుమ్ము కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని వారు తెలిపారు. కల్వర్టుల నిర్మాణానికి సంబంధించిన టెండర్లు ఇప్పటికీ పూర్తి కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆరోపించారు. వర్షాకాలం సమీపిస్తున్న వేళ పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకుడు జక్కనపెల్లి రాజ్‌కుమార్ వెంటనే డబుల్ రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## శాతవాహన విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగానికి పేటెంట్




**కరీంనగర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగానికి భారత ప్రభుత్వ ఇండియన్ పేటెంట్ కార్యాలయం పేటెంట్ మంజూరు చేసింది. ఈ పేటెంట్‌ను అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎ. జయంతి, డా. ఎన్. మల్లా రెడ్డి అభివృద్ధి చేశారు. క్యాన్సర్ నిరోధక సామర్థ్యం కలిగిన కొత్త బెంజిమిడాజోల్--1,2,4-ట్రయాజోల్ ఉత్పన్నాలను రూపకల్పన చేసి, వాటి తయారీకి సమర్థవంతమైన పునరుత్పాదక విధానాన్ని అభివృద్ధి చేయడం ఈ పరిశోధనలో ప్రధాన లక్ష్యం. ఔషధ రసాయన శాస్త్రం, క్యాన్సర్ పరిశోధన రంగాల్లో ఇది గణనీయమైన పురోగతిగా భావిస్తున్నారు. ఈ పేటెంట్ ఆమోదంతో విశ్వవిద్యాలయానికి 20 సంవత్సరాలపాటు ప్రత్యేక మేధో సంపత్తి హక్కులు లభించనున్నాయి. ఇది ఆవిష్కరణకు చట్టపరమైన రక్షణను కల్పించడంతో పాటు వాణిజ్యీకరణకు అవకాశాలను పెంచుతుంది. ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ పరిశోధకులను అభినందిస్తూ, ఇటువంటి విజయాలు విశ్వవిద్యాలయాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన ఖ్యాతిని పెంచుతాయని అన్నారు. ఆవిష్కర్తలు టీజీకాస్ట్ సంస్థకు ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, విశ్వవిద్యాలయం, ఉపకులపతి, రిజిస్ట్రార్, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## మానవత్వం చాటుకున్న మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ గాండ్ల శ్రీకాంత్ కుటుంబాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పరామర్శించారు. అద్దె యజమాని ఇంట్లోకి రానివ్వకపోవడంతో పద్మానగర్ స్మశానవాటికలో తలదాచుకున్న కుటుంబ పరిస్థితి తెలుసుకున్న మేయర్ చలించిపోయారు. మంగళవారం ఆయన స్మశానవాటికకు వెళ్లి కుటుంబ సభ్యులను కలుసుకుని ధైర్యం చెప్పారు. నిత్యావసర సరుకులు అందజేసి, పిల్లల చదువు విషయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో నాలుగు చోట్ల కర్మకాండ నిలయాలను నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక్కో నిలయానికి రూ.50 లక్షల నిధులు కేటాయించి అన్ని మౌలిక వసతులతో జి+1 భవనాలను నిర్మిస్తామని చెప్పారు. అంత్యక్రియల సమయంలో అద్దె ఇండ్లలో నివసించే కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ఈ నిలయాలు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థలో కొనసాగుతున్న అఖరి సఫర్ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు మార్పులు చేస్తున్నామని, పేద కుటుంబాలకు ఆధార్ కార్డు ధృవీకరణతో ఒక్క రూపాయికి అంత్యక్రియలు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తెల్ల లక్ష్మీ రమేష్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ గట్టుస్వామీ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు సల్ల, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**గంగాధర, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం రంగారావుపల్లె గ్రామంలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు సల్ల ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దాసరి శంకరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మౌనిక, ఉపసర్పంచ్ ద్వావ బహదూర్ రెడ్డి, వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. కూలీల ఆరోగ్య రక్షణ కోసం వేసవి కాలంలో ఇలాంటి చర్యలు అవసరమని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

## పదవ తరగతి ఫలితాల్లో కరీంనగర్ విద్యార్థుల ప్రతిభ






**కరీంనగర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో కరీంనగర్ విద్యార్థులు ప్రతిభాపాటవాలు కనబరిచారు. శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థిని ఉమా రెడ్డి నిశ్విత 570 మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. గ్రామీణ నేపథ్యం నుండి వచ్చినప్పటికీ పట్టుదలతో చదివి ఈ విజయాన్ని సాధించానని, గురువుల ప్రోత్సాహమే తన విజయరహస్యం అని నిశ్విత పేర్కొంది. గన్నేరువరం మండల పాఠశాలలు మరోసారి 100% ఉత్తీర్ణత సాధించి రికార్డు కొనసాగించాయి. 101 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వారందరూ ఉత్తీర్ణులయ్యారు. వారిలో 72 మంది 500కు పైగా మార్కులు సాధించారు. గన్నేరువరం ఉన్నత పాఠశాల విద్యార్థిని వైష్ణవి 559 మార్కులతో ప్రథమ స్థానం, మరో విద్యార్థి 555 మార్కులతో ద్వితీయ స్థానం పొందారు. మండల విద్యాధికారి రామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని, గత మూడు సంవత్సరాలుగా 100% ఉత్తీర్ణత సాధించడం గన్నేరువరం మండలానికి గర్వకారణమని అన్నారు. ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ కనుకయ్య, ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించారు. కరీంనగర్ విద్యార్థుల ఈ విజయాలు జిల్లా విద్యా ప్రమాణాలను మరింత ఎత్తుకు తీసుకెళ్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## 100 శాతం ఫలితాలు సాధించిన మర్రిగూడ పీఎం శ్రీ మోడల్ స్కూల్

**మర్రిగూడ, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈసారి విడుదలైన ఎస్ఎస్సీ ఫలితాల్లో మర్రిగూడ పీఎం శ్రీ మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 100 శాతంఉత్తీర్ణత సాధించారు. టాపర్లలో ఇడం సంజయ్ కుమార్ (523), బోయపల్లి మహేశ్వరి (523), నడుంపల్లి కావ్య (517), రమావత్ చాతుర్య (515) నిలిచారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉయ్యాల వెంకటేశం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందిస్తూ, ఈ విజయాన్ని పాఠశాల విద్యా ప్రమాణాలకు ప్రతిబింబంగా పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేయాలని, ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం అవకాశాలు ఉన్నందున ధాన్యాన్ని తక్షణమే తూకం వేసి సురక్షితంగా నిల్వ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రస్తుతం 80 శాతం పూర్తయిందని, దీన్ని 92 శాతానికి పెంచేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏడీఏలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థుల ఘన విజయం



**పెద్దపల్లి, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బుధవారం విడుదలైన ఎస్ఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి విశేష ప్రతిభ కనబర్చారు.ఈ పరీక్షలకు హాజరైన 61 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారు. వారిలో బి. వీక్షిత్ 583 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందగా, నూర్ ఫాతిమా 582, పి. సుబీక్షన్ 581, బి. గీతిక 579, అమీమా తహ్రీన్ 578, జే. సాహితీ ప్రియ 575, జి. అశ్విత్ కౌండిన్య 575, ఎన్. హరిని 572, యు. చక్రిక 571, సిహెచ్. లయవర్ధిని 571 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారు.గణితంలో ముగ్గురు విద్యార్థులు 100కు 100 మార్కులు సాధించగా, 25 మంది 90కు పైగా మార్కులు పొందారు. తెలుగులో భూసారపు వీక్షిత్ 100కు 100 మార్కులు సాధించడం పాఠశాలకు గర్వకారణమని సంస్థ చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ పేర్కొన్నారు.500 మార్కులకు పైగా 36 మంది విద్యార్థులు సాధించడం విశేషమని, ఈ విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కరెస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపల్ విజయ్, వైస్ ప్రిన్సిపల్ ప్రియాంకతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# హుజురాబాద్ డివిజన్ చీటింగ్ కేసులపై సీపీ సమీక్ష



**హుజురాబాద్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం హుజురాబాద్ ఏసీపీ కార్యాలయంలో డివిజన్ స్థాయి పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులపై క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా చీటింగ్, ఫోర్జరీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, అమాయక ప్రజలను మోసం చేసే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా కేసులను వేగంగా కొలిక్కి తీసుకురావాలని సూచించారు. నేరస్తులు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నందున ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ ఆధారాలను వినియోగించి విచారణను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. కోర్టులో శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాలతో ఛార్జ్ షీట్లు నిర్ణీత గడువులో దాఖలు చేయాలని ఆదేశించారు.ప్రజల్లో నమ్మకం పెంపొందించేలా అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలని సీపీ గౌష్ ఆలం సూచించారు. ఈ సమావేశంలో ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, ఎస్సైలు ఆవుల తిరుపతి, స్వాతి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో ప్రారంభమైన అమరవీరుల స్మారక బ్యారక్ విశ్రాంతి భవనం




**కరీంనగర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పోలీస్ సిబ్బంది సంక్షేమం, వసతి సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో హుజురాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్మించిన అమరవీరుల స్మారక బ్యారక్ సిబ్బంది విశ్రాంతి భవనాన్ని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి గౌరవార్థం ఈ భవనాన్ని నిర్మించామని తెలిపారు. సిబ్బందికి మెరుగైన వసతి, మౌలిక సదుపాయాలు కల్పించడం వల్ల వారు మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేయగలరని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పని వాతావరణాన్ని ఆధునీకరించి, సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడకుండా చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, ఎస్సైలు ఆవుల తిరుపతి, స్వాతి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు విద్యార్థుల విజయదుందుభి

మండల టాపర్ గా నిలిచిన విద్యార్థులు దండవేణి శ్రీలేఖ,ఆడెపు అనిరుద్,ఎర్ర నందిని







**ఎలిగేడు, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2026 ఎస్ఎస్సి ఫలితాల్లో ఎలిగేడు మండల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 100% ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 66 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై అందరూ విజయాన్ని సాధించారు.మండల స్థాయిలో దండవేణి శ్రీలేఖ (538/600) ప్రథమ స్థానం, ఆడెపు అనిరుద్ (523/600) ద్వితీయ స్థానం, ఎర్ర నందిని (514/600) తృతీయ స్థానం సాధించారు.మండల విద్యాశాఖ అధికారి నరేంద్ర చారి విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తూ, ఈ ఫలితాలు ఎలిగేడు మండల ఖ్యాతిని మరింత పెంచాయని పేర్కొన్నారు.

# మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపు




**కరీంనగర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వారోత్సవాలను జిల్లాలోని అన్ని గ్రామాలు, పని ప్రదేశాల్లో ఎర్రజెండాలు ఎగరవేసి జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ ఆఫీస్ ముకుంద్‌లాల్ మిశ్రా భవన్‌లో మేడే కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1886లో అమెరికా చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినం, కనీస వేతనాలు, కార్మిక సంఘాల నిర్మాణ హక్కుల కోసం కార్మికులు పోరాడి ప్రాణత్యాగాలు చేసి సాధించిన రోజు మేడే అని గుర్తు చేశారు.నేటి కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే విధానాలు అమలు చేస్తోందని, లేబర్ కోడ్‌ల రూపంలో కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తోందని ఆయన విమర్శించారు. ఎనిమిది గంటల పని దినం స్థానంలో 12--16 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి, కనీస వేతనాల అమలు లేకపోవడం, కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మేడే అమరుల స్ఫూర్తితో కార్మిక వర్గం మరింత ఐక్యంగా పోరాడాలని ముకుంద రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పునుటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఈ. రమేష్, సహాయ కార్యదర్శి పి. రవి పాల్గొన్నారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం

**కరీంనగర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం ఇందిరా గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రవల్లి స్వర్ణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ప్రతి పథకం మహిళల పేరుతో ఉండేలా ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. మహిళలను




ఆర్థికంగా బలోపేతం చేయడానికి పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, ఇందిరమ్మ ఇళ్ల యజమానులుగా చేయడం, అకౌంట్లలో నేరుగా నిధులు జమ చేయడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు.మహిళా కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించేందుకు కష్టకాలంలో పార్టీ కోసం శ్రమించిన వారి జాబితాను సిద్ధం చేసి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ధర్మపురి మున్సిపల్ చైర్పర్సన్ మహాలక్ష్మి, సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, చర్ల పద్మ, కరీంనగర్ నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెన్నం రజిత రెడ్డి, నాయకురాలు పూదరి రేణుక గౌడ్, పడిశెట్టి వసంత లక్ష్మి, చంద్రకళ, సిరిపురం లావణ్య, హసీనా, రాచర్ల పద్మతో పాటు జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మహిళా మున్సిపల్ చైర్పర్సన్లు, మార్కెట్ కమిటీ మహిళా చైర్పర్సన్లు, మహిళా సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్‌నగర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులు తమ పంటను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు.పట్టణంలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, “అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. మద్దతు ధరలతోనే పంటను విక్రయించాలి” అని స్పష్టం చేశారు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు : మొక్కజొన్న క్వింటాల్‌కు 2,400, వరి మొదటి రకం 2,389, వరి సాధారణ రకం 2,369. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో సహకరించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, డైరెక్టర్లు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్పై అవగాహన సదస్సు




**కరీంనగర్/సిద్ధిపేట, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా సిద్ధిపేట, కరీంనగర్ జిల్లాల్లో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.సిద్ధిపేటలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి నర్సింగ్ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ యువత సోషల్ మీడియా ద్వారా ఏర్పడే చెడు పరిచయాలకు లోనవకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటర్నెట్, టెక్నాలజీని అవసరానికి మాత్రమే వినియోగించాలని, అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయకూడదని హెచ్చరించారు. కుటుంబానికి ప్రాధాన్యత ఇచ్చి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని, ఆధ్యాత్మికత, యోగ, ధ్యానం ద్వారా సానుకూల దృక్పథం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.కరీంనగర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లల సంరక్షణ కేంద్రాల్లో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాలు జరిగాయి. బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి పిల్లలు ఫోన్‌లకు దూరంగా ఉండాలని, అపరిచితులతో చాట్ చేయడం, వ్యక్తిగత వివరాలు పంచుకోవడం, ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా మోసాలకు గురికావడం వంటి ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ సమస్యలు ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో సంక్షేమ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, బాలల సంక్షేమ సమితి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు



**హుస్నాబాద్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఎన్నికలు ఘనంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో జనవేణి సమ్మయ్య అధ్యక్షుడిగా, వస్తాదుల శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా, జనవేణి అనిల్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.తదితర డైరెక్టర్లుగా ఎన్నుకున్న అభ్యర్థులు విజయవంతంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు కాశవేణి రాకేష్, వస్తాదుల విజయ్, వస్తాదుల సురేష్, జనవేణి మల్లేశం, జనవేణి రాయమల్లు, వస్తాదుల రాజలింగం, జనవేణి కుమార్, వస్తాదుల మొండయ్య, జనవేణి అజయ్, జనవేణి కొమురయ్య తదితరులు పాల్గొని ఎన్నికలను విజయవంతం చేశారు.గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ ఎన్నికలు సంఘం ఐక్యతను ప్రతిబింబించాయి.

# ఘనంగా హిందూ సమ్మేళనం




**కరీంనగర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ గణేష్‌నగర్ బైపాస్ రోడ్‌లో గణేష్‌నగర్ బస్తి హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య భారతి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక క్షేత్ర సంఘటనా కార్యదర్శి అమ్మినేని కుమారస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని హిందువులంతా కులాలకు అతీతంగా ఐక్యంగా ఉండి సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ మాట్లాడుతూ హిందూ ధర్మం, సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని, పిల్లలకు విద్యతో పాటు పురాణాలు, రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి గ్రంథాలను బోధించాలని సూచించారు. మహిళా వక్త కామారపు మంజుల కుటుంబంలో మహిళలు, బాలికలు సంప్రదాయాలను పాటించాలని, యువతులు లవ్ జిహాద్ వంటి ప్రమాదాల నుండి రక్షించుకోవాలని కోరారు.ఈ సమ్మేళనంలో గణేష్‌నగర్, హనుమాన్‌నగర్, తిరుమలనగర్, బాలాజీ నగర్, దోబి వాడ, ఎన్జీవోస్ కాలనీ నుండి దాదాపు మూడు వేల మంది పాల్గొన్నారు. గణేష్‌నగర్ బస్తి హిందూ సమ్మేళనం అధ్యక్షుడు పొన్నం మల్లయ్య గౌడ్, కార్యదర్శి హన్మాండ్ల రాజిరెడ్డి, కార్పొరేటర్లు కొలిపాక రమ్యశ్రీ, నలువాలా పుష్పలతతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు 28 మందిని సన్మానించారు.

# ఘనంగా బాలమేళా అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



**హుస్నాబాద్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కోహెడ మండలం రామచంద్రపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ రవీందర్ ఆధ్వర్యంలో బాలమేళా, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. ప్రీ-స్కూల్ విద్య పూర్తి చేసిన చిన్నారులకు పట్టాలు అందజేసి ప్రత్యేకంగా సత్కరించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ సాయి భవాని మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. బాలమేళాలో భాగంగా పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై తల్లిదండ్రులు, చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, వార్డ్ సభ్యులు అనంత లక్ష్మి, మమత, పద్మ, పంచాయతీ కార్యదర్శి రాధ, ఎంఎల్హెచ్‌పీ హరీష్, ఏఎన్ఎమ్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, రిలయన్స్ ఫౌండేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ భాస్కర్ పాల్గొన్నారు.

## పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు



**తలకొండపల్లి, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో విజయవంతమైన విద్యార్థులకు యువ నాయకుడు పెరుమాండ్ల సురేష్ శుభాకాంక్షలు తెలిపారు.ఆయన మాట్లాడుతూ, "మీ ప్రతిభను కొనసాగిస్తూ పై చదువుల్లో, పోటీ పరీక్షల్లో కూడా మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవం తీసుకురావాలి" అని ఆకాంక్షించారు. పరీక్షల్లో విఫలమైన వారు అధైర్యపడకుండా సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

# అన్నారంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం






**మానకొండూర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :మానకొండూర్ మండలం అన్నారం గ్రామంలోని లక్ష్మీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో బిజెపి మండల కార్యవర్గ సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన మండల కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే నెల 12న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో జరగబోయే హిందూ ఏక్తా యాత్రకు మండల పరిధిలోని గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరచారి, మాజీ మండల అధ్యక్షుడు బొంగోని శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీపూర్ ఉపసర్పంచ్ రాపాక ప్రవీణ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అప్పని తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణచారి, గౌడ సెల్ కన్వీనర్ పూదరి రమణ, మండల నాయకులు సోన్నకుల శ్రీనివాస్, వంగల ఆంజనేయులు, కత్తి ప్రభాకర్, తాడూరి కిరణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు శీలం కుమార్, భాషబోయిన ప్రదీప్ యాదవ్, ఉపాధ్యక్షులు మీసా రమణయ్య, ఎదులాపూరం అశ్విన్ తేజ, పోచంపల్లి శ్రీనివాస్, కార్యదర్శులు మార్క సుమతి, కొల శ్రీనివాస్, బొంపెల్లి రమేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు అడప రవి, బీజేవైఎం అధ్యక్షుడు కొండ్ర వరప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయతో పాటు అనేక మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దు

**- చాడ వెంకటరెడ్డి**



**కరీంనగర్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించాలని సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వరి కోతల సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మిల్లర్లకు ధాన్యం అప్పగించే విధానం రైతులకు భారమైందని పేర్కొన్నారు. మిల్లర్లు హమాలీ కొరత సాకు చూపుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.పౌర సరఫరాల శాఖ లేదా సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు పంపితే రైతులకు మేలు జరుగుతుందని, లేకపోతే రైతుల బ్రతుకులు బజారు పాలవుతాయని ఆయన హెచ్చరించారు. అకాల వర్షాలు పడితే వడ్లు తడిసి రైతులు నష్టపోతారని, అప్పులు తెచ్చుకొని పండించిన పంటలు కొనుగోలు చేయకపోతే రైతులు ఆత్మహత్యల దారిలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల పక్షాన నిలవాలని, లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేపడతామని చాడ వెంకటరెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, నాగెల్లి లక్ష్మారెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు




**కరీంనగర్/హుస్నాబాద్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణలో విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో గంగాధర మండలంలోని రంగారావుపల్లి ఎస్.ఆర్. ప్రైమ్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఎమ్.డి. సిద్దిక్ 579 మార్కులు, చి. వైష్ణవి 566, వి. హర్షిత 564, టి. సాయిమదన్ 561 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషిని ప్రశంసించింది. పాలకుర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రభంజనం సృష్టించాయి. కన్నాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని టి. సాయి వర్షిత 563 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా, జయ్యారం పాఠశాల విద్యార్థిని అనూహ్య 559 మార్కులు సాధించింది. మండలంలో 198 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 193 మంది ఉత్తీర్ణులయ్యారు. బసంతనగర్, పాలకుర్తి, కుక్కలగూడూరు, జయ్యారం ప్రభుత్వ పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించాయని విద్యాధికారులు తెలిపారు.జిల్లాలో అగ్రస్థానంలో నిలిచిన పిఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ధంగర్వాడి విద్యార్థులు కూడా విశేష ప్రతిభ కనబరిచారు. దువ్వాసి ప్రణవి 563 మార్కులు సాధించి పాఠశాల ఫస్ట్‌గా నిలవగా, సుద్దాల శ్లేష 540, మదిర జశ్వంత్ 526 మార్కులు సాధించారు. 9 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి 84% పైగా ఫలితాలు సాధించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల క్రమశిక్షణ, కృషి, అంకితభావం వల్లే ఈ విజయాన్ని సాధించారని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం పాఠశాల గర్వకారణమని పేర్కొన్నారు.హుస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధించారు. మొత్తం 53 మంది పరీక్షలు రాయగా 51 మంది ఉత్తీర్ణులయ్యారు. పిల్లి చరణ్ 557 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా, ఎండి సిమ్రాన్ 542, కత్తుల అభిలాష్ 540 మార్కులు సాధించారు. 34 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించడం విశేషమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.గంగాధర, పాలకుర్తి, ధంగర్వాడి, హుస్నాబాద్ విద్యార్థుల ఈ విజయాలు జిల్లా విద్యా ప్రమాణాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లాయని అధికారులు అభినందించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన నేతలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ కేశవులు తోడల్లుడు కుమార్తె వివాహ వేడుకలు హైద్రాబాద్ సాగర్ రింగ్ రోడ్ వన్ కన్వెన్షన్ హాల్లో జరిగింది. ఈ వేడుకలకు టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఇటిక్యాల రమణారెడ్డి, పాత్రికేయులు ఏలే నిరంజన్, ఆర్యవైశ్య సంఘం జిల్లా బిక్కుమండ్ల రమేష్ గుప్తా ఈ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను అక్షింతలు వేసి దీవించారు.

# 2 బిహెచ్కే కాలనీలో లారీలు, మట్టి దిబ్బలతో ఇబ్బందులు



**బడంగ్‌పేట్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బడంగ్‌పేట్ సర్కిల్‌లోని 58వ డివిజన్ ప్రశాంతి హిల్స్, లెనిన్ నగర్ రైతు బజార్ పక్కన ఉన్న 2 బిహెచ్కే కాలనీలో నివాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీలు అడ్డంగా నిలిపివేయడం, మట్టి దిబ్బలు పేరుకుపోవడం, సేవాలాల్ గుడి వద్ద జేసీబీలు అడ్డుగా మారడం వల్ల పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.నివాసులు తమ సమస్యలను చెప్పుకుంటే జులూమ్ చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బి. శంకర్ నాయక్, బి. బాలు నాయక్, ఆర్. రవీందర్ నాయక్, ధరావత్ స్వామి నాయక్ తదితరులు కలిసి ఏసిపిని కలసి తమ గోడును వివరించారు. వెంటనే స్పందించిన ఏసిపి, లారీలు తొలగించే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# చైతన్య వేదికలుగా విద్యా సంస్థలు నిలవాలి



**-ఎంపిడిఓ డానియల్ పిలుపు**
**-ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సర అడ్మిషన్ల సందడి షురూ.**

**దేవరకొండ ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పట్టణంలో మునగాల కొండలరావు ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా కళాశాల అడ్మిషన్ల ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దేవరకొండ ఎంపిడిఓ ఎం.ఎస్.డి. డానియల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఓ డానియల్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు మరియు విద్యపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో విద్యార్థులు, అధ్యాపకులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమాజ వికాసానికి విద్యా సంస్థలు చైతన్య వేదికలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో కూడా స్ఫూర్తిని నింపేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అనంతరం 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన కళాశాల అడ్మిషన్ల గోడపత్రికను అతిథులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ డివిజన్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొర్ర రాంసింగ్ నాయక్,ఎం. పి.ఓ రామావత్ సాగర్ నాయక్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య సి.ఓ.ఈ జి లింగారెడ్డి ,అధ్యాపకులు ఏ . శ్రీను ఎం.జగపతిబాబు తదితర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రజా సేవతోనే సమాజంలో గుర్తింపు

**- చెక్కల లక్ష్మణ్**



**ఆమనగల్లు, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజా సేవతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని బీజేపీ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యురాలిగా పదవి బాధ్యతలు చేపట్టిన కండె సీతారాములమ్మ ను గురువారం పట్టణ కేంద్రంలోని పురాతన శివాలయంలో 15వ వార్డు కాలనీ వాసులతో కలిసి ఆమెను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చెక్కల లక్ష్మణ్ మాట్లాడుతూ.. పేదలకు అండగా ఉండి నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేయాలన్నారు. ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోట్ల వెంకటేష్, కండె భాస్కర్, గుజ్జరి ప్రవీణ్, పూజారి శివ, ఈశ్వరయ్య, నవీన్, తిరుపతయ్య, శోభా, భాగ్యమ్మ, సృజన, రామచంద్రమ్మ, జయమ్మ తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కారానికి చర్యలు

**- కో ఆప్షన్ సభ్యుడు అల్లాజీ గౌడ్**



**ఆమనగల్లు, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా మున్సిపాలిటీలోని సమస్యలను తెలుసుకుని మున్సిపల్ పాలకవర్గం సహకారంతో తొందరగానే పరిష్కరిస్తున్నామని కో ఆప్షన్ సభ్యుడు చుక్క అల్లాజీ గౌడ్ అన్నారు. బుధవారం 12వ వార్డు శాంతి నగర్ కాలనీలో సందర్శించి అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీల పూడిక, సకాలంలో చెత్త తొలగింపు, వీధి దీపాలు ఏర్పాట్లు చేయాలని విన్నవించారు. స్థానికులు చెప్పిన సమస్యలను విని తొందరగానే పరిష్కారిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట పల్లె నారాయణ గౌడ్, నాగిళ్ళ సందీప్, నరేష్, శివ గౌడ్, దుర్గ ప్రసాద్, శోభా, సంతోష, కవిత, మమత తదితరులు ఉన్నారు.


## నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే ప్రమాదాలు

**– మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్**




**ఆమనగల్లు, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆమనగల్లు మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు అధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'అరైవ్-అలైవ్ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, కౌన్సిలర్లు మొక్తల వెంకటయ్య, నిరంజన్, కమిషనర్ శంకర్ నాయక్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ పత్యనాయక్ మాట్లాడుతూ.. ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అజాగ్రత్తగా, అతి వేగంగా వాహనాలు నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక పోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అవుతున్నాయన్నారు. ఎవరికివారు తమవంతు బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ ను విధిగా పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్ఐ సీతారాం రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, నాయకులు సురేష్ నాయక్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## ఉప్పల్ కొత్త బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు



**ఉప్పల్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పల్ నుండి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా అధికారులు ఇటీవల వరంగల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్టాండ్‌ను ఉప్పల్ నల్లచెరువుకట్ట వద్దకు మార్చారు. అయితే కొత్త బస్టాండ్ మార్పు గురించి ప్రయాణికులకు సమాచారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ప్రయాణికుల కోసం టెంట్లు, కుర్చీలు, మంచినీటి సదుపాయాలు ఏర్పాటు చేసినా, మరుగుదొడ్లు లేకపోవడం మహిళలు, వృద్ధులకు పెద్ద సమస్యగా మారింది. ఈ కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.ప్రయాణికులు అధికారులు తక్షణమే స్పందించి తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## "తండ్రి మనసు బాధ" డ్రామా ఆపాలి

**-కప్పాటి పాండురంగా రెడ్డి**




**రంగారెడ్డి, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "కన్న తండ్రి మనసు బాధపడుతుంది" అంటూ రాజకీయాల కోసం మొసలి కన్నీరు కారుస్తున్న బిఆర్ఎస్ నాయకులను, వారి అనుచరులను తెలంగాణ రాష్ట్రసేన జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి నిలదీశారు.ఆయన మాట్లాడుతూ, "కవితమ్మను పార్టీ నుండి సస్పెండ్ చేసినప్పుడు తండ్రి ప్రేమ ఎక్కడ? జైలు పాలైనప్పుడు బాధ ఎందుకు అనిపించలేదు? దుబాయ్‌లో అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు? సొంత అల్లుడి ఫోన్ ట్యాపింగ్ చేసినప్పుడు కనీస నైతిక బాధ ఎందుకు కలగలేదు?" అంటూ వరుస ప్రశ్నలు సంధించారు. 'కవిత స్వయంగా 'నా మీద కుట్రలు జరుగుతున్నాయి' అని పార్టీ భవన్‌లోనే ఆవేదన వ్యక్తం చేసినప్పుడు కూడా స్పందించని కేసీఆర్, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం 'తండ్రి మనసు' అంటూ డ్రామాలు ఆడటం ఆపాలి. నిజమైన బాధ బిడ్డ జైలుకు వెళ్ళినప్పుడు, సొంత పార్టీలో అవమానాలు ఎదురైనప్పుడు ఉండాలి" అని పాండురంగా రెడ్డి స్పష్టం చేశారు.బిఆర్ఎస్ నాయకులు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా అని ఆయన సవాల్ విసిరారు.

# ' వివేక ' స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**ఆమనగల్లు, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణ కేంద్రంలోని వివేక విద్యా భారతి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోలీ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మహమూద్ మాట్లాడుతూ.. విద్యార్థులు పి. జయశ్రీ 581, ఎన్. మానస 573 మార్కులు సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు మొదటి నుంచి మెరుగైన ఫలితాలు సాధిస్తూ.. విజయమార్గంలో పయనిస్తున్నారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎంఈఓ పాండు శుభాకాంక్షలు తెలిపారు.




## ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ప్రతిభ



**ఆమనగల్లు, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ప్రతిభ కనబరిచారు. బుధవారం విడుదల అయిన పదో తరగతి ఫలితాల్లో హిమబిందు 562 మార్కులతో స్కూల్ టాపర్ గా నిలిచింది. మంచి ఉత్తీర్ణత శాతం నమోదైనందుకు ప్రిన్సిపల్ రామలక్ష్మి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఫెయిల్ అయిన వారు నిరుత్సాహపడకుండా సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆమె సూచించారు.

## అనంతపద్మనాభ స్వామి ఆలయానికి ఆవు, దూడ అందజేత



**మహేశ్వరం, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల నల్లచెరువు తాండకు చెందిన దాత దన్నాద వెంకటేష్ యాదవ్ భక్తి భావంతో పెంజర్ల శ్రీ స్వయంభు అనంతపద్మనాభ స్వామి ఆలయానికి ఆవు, దూడను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనిత రెడ్డి, మాజీ జెడ్పీటీసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి సమక్షంలో ఆయన ఈ దానం చేశారు. అనంతపద్మనాభ స్వామి ఆలయానికి సేవ చేయడం తనకు గొప్ప అదృష్టమని వెంకటేష్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాత్లావత్ సందీప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. వెంకటేష్ యాదవ్ కుటుంబానికి స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

## గొర్రెలు, మేకల సంత ప్రారంభం



**కల్వకుర్తి, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గొర్రెలు, మేకల సంతను మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో జరిగింది. ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పరుశపాకుల శేఖర్, బ్లాక్ కాంగ్రెస్ బీసీ విభాగం ఉపాధ్యక్షుడు మరదకు సైదులు యాదవ్, సీనియర్ నాయకుడు పర్వత్ రెడ్డి, యువ నాయకుడు పవన్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "గొర్రెలు, మేకల సంత రైతులకు, వ్యాపారులకు ఉపయోగకరంగా ఉండి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని" పేర్కొన్నారు.

## గుడుంబా, డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం




**మహబూబాబాద్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గుడుంబా, డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు, జె.సి. ఎన్‌ఫోర్స్మెంట్, డీసీ వరంగల్ అంజన్ రావు సూచనలతో డిపిఈఓ మహబూబాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి చర్యలు ప్రారంభమయ్యాయి. మహబూబాబాద్ మండలంలోని ముత్యాలమ్మగూడెం వద్ద తనిఖీల్లో నంబర్ లేని టాటా గ్జినాన్ వాహనాన్ని ఆపగా, ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. వాహనంలో 1500 కిలోల నల్ల బెల్లం, 150 కిలోల పటిక, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ, "నాటుసారా తయారీ, రవాణా, విక్రయం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంది. తెలంగాణను గుడుంబా, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రజలు, మీడియా, యువత సహకరించాలి" అని విజ్ఞప్తి చేశారు. ఈ దాడిలో ఎక్సైజ్ సీఐలు జి. చిరంజీవి, సి.హెచ్. నీరజ, ఎస్సైలు అశోక్, మౌనిక, కిరీటి, కానిస్టేబుళ్లు హరీష్, విజయ్, జాన్ పాషా పాల్గొన్నారు.

## స్ఫూర్తి దివ్యాంగుల పొదుపు సంఘం ఏర్పాటు



**బోడుప్పల్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా దివ్యాంగులకు పొదుపు సంఘాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు బోడుప్పల్‌లో కొత్తగా "స్ఫూర్తి దివ్యంగుల పొదుపు సంఘం" బుధవారం ఏర్పాటైంది. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ శిల్పా మాట్లాడుతూ, "గ్రూపు సభ్యులు ప్రతి నెల పొదుపు జమ చేస్తే భవిష్యత్తులో లోన్లు పొందే అవకాశం ఉంటుంది. తేది లోపు చెల్లింపులు సక్రమంగా జరగాలి" అని సూచించారు. ఆర్పీ ఇదుల రేణుక మాట్లాడుతూ, "మహిళా స్వయం ఉపాధి సంఘాలు ఆర్థికంగా ముందంజలో ఉన్నాయి. దివ్యాంగుల సమాజం కూడా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ సంఘాలను ఏర్పాటు చేస్తోంది" అని తెలిపారు. సభ్యులు క్రమంగా పొదుపు చేస్తే త్వరలోనే బ్యాంకు అధికారులతో మాట్లాడి లోన్లు పొందేలా ప్రయత్నిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఇప్పటివరకు పొదుపు గ్రూపులో లేని దివ్యాంగులు ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకన్న, ప్రధాన కార్యదర్శి నాగరాజు, పులి రావి, కృష్ణ ప్రియ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండ పట్టణ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా జంగిలి ఆనంద్ రాజ్



**వెల్దండ, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ పట్టణ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడిగా జంగిలి ఆనంద్ రాజ్ ఎన్నికయ్యారు. స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆశీస్సులతో ఈ పదవి రావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఆనంద్ రాజ్ మాట్లాడుతూ, "పార్టీ కోసం కష్టపడితే పదవులు సహజంగానే వస్తాయి. కాంగ్రెస్ ఎల్లప్పుడూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుంది" అని తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భూపతిరెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఎండల్లో ట్రాఫిక్ సిబ్బందికి ఊరట



**మహబూబాబాద్, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తీవ్ర ఎండల్లో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి ఊరట కలిగించేందుకు జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆధ్వర్యంలో నెహ్రూ సెంటర్ ట్రాఫిక్ పోస్ట్ వద్ద వాటర్ మిస్ట్ స్ప్రింక్లర్ ఆధారిత కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఈ సిస్టమ్ ద్వారా నీటి మిస్ట్ రూపంలో చల్లదనం కలగడంతో సిబ్బందికి తక్షణ ఉపశమనం లభిస్తుంది. అదనంగా ట్రాఫిక్ సిబ్బందికి మిల్లెన్ వాటర్ ఫ్లాస్క్‌లు, కూలింగ్ గాగుల్స్ పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ, "ప్రజల భద్రత కోసం ఎండల్లోనూ అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బంది ఆరోగ్యం కాపాడటం పోలీస్ శాఖ బాధ్యత. హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ నివారణకు జాగ్రత్తలు పాటించాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ తిరుపతిరావు, సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐ అరుణ్ కుమార్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి


మృతుడు యాళ్ల మల్లారెడ్డి

**ఎలిగేడు, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని లాలపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యాళ్ల మల్లారెడ్డి (52) ఈనెల 26న గృహప్రవేశం పనులలో తిరుగుతూ ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామా రాజేశ్వర్ రెడ్డి, సర్పంచ్ ఏలేటి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## వెల్దండ విద్యార్థుల విజయదుందుభి

**వెల్దండ, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో వెల్దండ మండల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం 329 మందిలో 325 మంది ఉత్తీర్ణత సాధించి 99% ఫలితాన్ని నమోదు చేశారు. మండలంలోని బొల్లంపల్లి, రాచూర్, వెల్దండ బాలికల--బాలుర జెడ్పీ పాఠశాలలు, పోతేపల్లి, కేజీబీవీ వెల్దండ, గురుకుల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 100% ఉత్తీర్ణత సాధించారు. పెద్దాపూర్, కొట్ర పాఠశాలలు 96%, మోడల్ స్కూల్ వెల్దండ 97% ఫలితాన్ని సాధించాయి. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులలో హనియా ఫిర్దోజ్ (557), శిరీష (540), అనుష్క (574)లను మండల విద్యాధికారి చంద్రుడు ప్రత్యేకంగా అభినందించారు.


## ఆలయంలో వైభవంగా శేషవాహన సేవ



**ఎలిగేడు, ఏప్రిల్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామంలో వెలసియున్న శ్రీ మదలమేల్మంగా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శేషవాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం హోమం, ప్రాథోభకి బలిహరణం, సాయంత్రం మహాదాశీర్వచనం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.

# బిజినెస్

## ఫోన్‌పేకు 5 కోట్ల మంది మర్చంట్లు



**న్యూఢిల్లీ**

డిజిటల్ చెల్లింపుల దిగ్గజం ఫోన్‌పే 5 కోట్ల మంది రిజిస్టర్డ్ మర్చంట్‌ల మైలురాయిని చేరుకున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 98 శాతం పిన్ కోడ్‌లలో విస్తరించిన ఫోన్‌పే.. చిన్న వ్యాపారులకు కేవలం పేమెంట్స్ మాత్రమే కాకుండా ఇన్సూరెన్స్, లోన్ల వంటి పూర్తిస్థాయి ఆర్థిక సేవలను అందిస్తోందని ఆ సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ పేర్కొన్నారు. ఈ ప్రయాణం క్యూఆర్ కోడ్‌తో మొదలై ఇప్పుడు అతిచిన్న వ్యాపారులను కూడా అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకువచ్చిందన్నారు.

## కుప్పకూలుతున్న బంగారం, వెండి.. భారీగా తగ్గిన ధరలు.. ఎంత తగ్గిందంటే

మహిళలకు శుభవార్త చెబుతున్నాయి బంగారం, వెండి ధరలు. ఏప్రిల్ 29, 2026 (బుధవారం) నాటి తాజా సమాచారం ప్రకారం, బంగారం, వెండి ధరలలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా ధరలు కొంత తగ్గుముఖం పట్టాయి. గతంలో వినియోగదారులకు చుక్కలు చూపించిన గోల్డ్, సిల్వర్ ధరలు.. ప్రస్తుతం భారీ స్థాయిలో దిగి రావడం ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయనే చెప్పాలి. హైదరాబాద్ సహా ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు భారీగానే తగ్గాయి. హైదరాబాద్- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,350 (సుమారు రూ.2,540 తగ్గింది). 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,50,930 (సుమారు రూ.2,770 తగ్గింది).

ఢిల్లీ -- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,490 ఉండగా, అదే 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,51,070 వద్ద కొనసాగుతోంది. ముంబై- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,340 ఉండగా, అదే 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,50,920



వద్ద కొనసాగుతోంది.

చెన్నై -- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,990 ఉండగా, అదే 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,53,810 వద్ద కొనసాగుతోంది.

**వెండి ధరలు (1 కేజీకి):**

వెండి ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల స్వల్ప మార్పులు కనిపించినప్పటికీ, సగటు ధరలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్/విజయవాడలో కిలో బంగారం ధర రూ.2,69,900. ఉండగా, దేశవ్యాప్తంగా సగటు: రూ.2,60,000 నుండి రూ.2,65,000 మధ్యలో ఉంది.

**అంతర్జాతీయ ప్రభావం:** అమెరికా డాలర్ బలోపేతం కావడం, గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గుల వల్ల పసిడి ధరలపై ఒత్తిడి పెరిగింది. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్నప్పటికీ, ధరలలో వచ్చిన ఈ తాత్కాలిక తగ్గుదల కొనుగోలుదారులకు కొంత ఊరటనిస్తోంది. ప్రస్తుతం ధరలు గరిష్ట స్థాయిలోనే ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా పెట్టుబడిదారులు బంగారంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల సంకేతాలు, స్థానిక మార్కెట్‌లో లోయర్ డిమాండ్, అనిశ్చితి వంటివి ఈ పతనానికి కారణమయ్యాయి.


## సిగరేట్ తాగేవారికి బిగ్ షాకింగ్ న్యూస్..

**-మరోసారి పెరగనున్న ధరలు..! మే నెలలోనే..**

సిగరేట్ తాగేవారికి మరోసారి షాక్ తగలనుంది. వీటి ధరలు మరోసారి పెరిగే అవకాశముందని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ, ఎక్సైజ్ డ్యూటీ పెంచడంతో ఫిబ్రవరి 1 నుంచి ధరలు పెరిగాయి. దీంతో పొగవారి మరింత ఖర్చు అవుతుంది. అయితే మేలో సిగరేట్ ధరలు మరోసారి పెరగవచ్చని చెబుతున్నారు. దీనికి కారణం సేల్స్ తగ్గడమే. కేంద్రం జీఎస్టీ పెంచడంతో ధరలు పెరగడంతో సిగరేట్ తాగేవారు తగ్గిపోయారు. సేల్స్ తగ్గిపోవడంతో కంపెనీలకు నష్టాలు వస్తున్నాయి. దీనిని భర్తీ చేసుకునేందుకు ధరలను మరోసారి పెంచాలని కంపెనీలు భావిస్తున్నాయి.

**16 శాతం పెరిగే అవకాశం**

మేలో సిగరేట్ ధరలు 17 శాతం పెరగవచ్చని




చెబుతున్నారు. దీంతో పొగతాగేవారి జేబుకు చిల్లులు పడనున్నాయి. కేంద్రం ఈ ఏడాది ఫిబ్రవరి 1 నంచి పొగాకు ఉత్పత్తులపై ఎక్సై?జ్ డ్యూటీని 30 నుంచి 40 శాతానికి పెంచింది. దీంతో కంపెనీలు సిగరేట్ ధరలను పెంచాల్సి వచ్చింది. దీని వల్ల సిగరేట్ అమ్మకాలు భారీగా తగ్గుముఖం పట్టాయి. కింగ్ సైజ్ సిగరెట్ ధర రూ. 20 నుంచి రూ. 28కి పెరిగింది. ప్రస్తుతం గోల్డ్ ఫ్లేక్ ప్రీమియం ప్యాక్ రూ.115గా ఉండగా.. రూ.135కి పెరగనుందని తెలుస్తోంది. మార్ల్‌బరో, గోల్డ్ ఫ్లేక్ కింగ్స్, క్లాసిక్ వంటి సిగరేట్ల ధరలు మళ్లీ పెరగనున్నాయి. ఇక ఇతర బ్రాండ్ల సిగరేట్ల ధరలు కూడా పెరిగే అవకావముందని తెలుస్తోంది. సిగరేట్ ధరలు పెరిగితే.. తక్కువ ధర గల బ్రాండ్ల వైపు ప్రజలు మొగ్గు చూపవచ్చు. దీని వల్ల సిగరేట్ వినియోగం కూడా తగ్గే ఛాన్స్ ఉంది. తక్కువ ధర కలిగిన సిగరేట్ బ్రాండ్లకు డిమాండ్ పెరగనుంది. కంపెనీలు ధరలను పెంచి లాభాల కోసం చూస్తుండగా.. తాగేవారికి మాత్రం భారం పడనుంది. అయితే సిగరేట్ల ధరలు పెరగనున్నాయనే కారణంతో స్టాక్ మార్కెట్లో సిగరేట్ కంపెనీల షేర్లు పెరిగాయి. ఏప్రిల్ 29న ఐటీసీ షేర్ 4 శాతం పెరిగింది. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ షేర్ కూడా 6.5 శాతం పెరిగింది.

---

## ఈ-సిగరేట్ తాగుతూ కెమెరాకి దొరికిన రియాన్ పరాగ్

ఐపీఎల్ 2026లో అదిరిపోయే విజయాలతో దూసుకుపోతున్న రాజస్థాన్ రాయల్స్ టీమ్.. పంజాబ్ కింగ్స్ విజయాల పరంపరకు బ్రేక్ వేసి పాయింట్ల పట్టికలో తన సత్తా చాటింది. అయితే ఈ సంతోషం ఎక్కువ సేపు నిలవలేదు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మంగళవారం న్యూ చండీగఢ్ వేదికగా పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ తలపడ్డాయి. అయితే రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ జరుగుతుండగా డ్రెస్సింగ్ రూమ్‌లో రియాన్ పరాగ్ వేపింగ్ (ఈ-సిగరేట్) చేస్తూ కనిపించాడు. ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ పక్కన ఉండగానే పరాగ్ ఈ-సిగరేట్ తాగుతూ కనిపించాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అధికృత ప్రాంతాలు మినహా.. ఛేజింగ్ రూమ్‌లలో లేదా మైదానాల్లో ధూమపానంకు అనుమతి లేదు. అదే సమయంలో 2019 నుంచి భారత్‌లో ఇ సిగరేట్ల విక్రయం, వాడకం పైనా నిషేదం ఉంది. ఒకవేళ పరాగ్ ఇ-సిగరేట్ తాగాడని తేలితే మాత్రం భారతదేశం ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం 2019 కింద



అతడికి శిక్ష పడే అవకాశం ఉందని అంటున్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలు శిక్ష, భారీ జరిమానా విధించబడతాయి. అంతేకాకుండా బీసీసీఐ కూడా అతడిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇక ఈ మ్యాచ్‌లో ఆర్ఆర్ 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఇదే తొలి ఓటమి. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. పంజాబ్ బ్యాటర్లలో మార్కస్ స్టోయినిస్ (62 నాటౌట్; 22 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (59; 44 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) లు హాఫ్ సెంచరీలు చేశారు. కూపర్ కొన్నోలీ (30; 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్రియాన్ష్ ఆర్య (29; 11 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడారు. రాజస్థాన్ బౌలర్లలో యశ్ రాజ్ పుంజా రెండు వికెట్లు తీశాడు. జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 223 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ రాయల్స్ 19.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆర్ఆర్ బ్యాటర్లలో డోనోవన్ ఫెరీరా (52 నాటౌట్; 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు), యశస్వి జైస్వాల్ (51; 27 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు హాఫ్ సెంచరీలు చేశారు. వైభవ్ సూర్యవంశీ (43 ; 16 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లు), శుభమ్ దుబే (31 నాటౌట్; 12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడారు. పంజాబ్ బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ మూడు, అర్షదీప్ సింగ్ ఓ వికెట్ పడగొట్టాడు.

## చెపాక్ దేశంలోనే అత్యంత చెత్త వేదిక

**-ఆసీస్ స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్**


ఐపీఎల్ 2026లో భాగంగా ఆర్సీబీ తరపున ఆడుతూ అదరగొట్టేస్తున్న ఆసీస్ స్టార్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ తాజాగా చేసిన కామెంట్స్ క్రికెట్ వర్గాల్లో పెనుదుమారం రేపుతున్నాయి. ఓ ఇంటర్వ్యూలో భారత్‌లోని వివిధ క్రికెట్ స్టేడియాలకు ర్యాంకులు ఇవ్వాలని ఆయనను కోరగా.. చెన్నై సూపర్ కింగ్స్ హోమ్ గ్రౌండ్ అయిన ఎం.ఏ. చిదంబరం స్టేడియం (చెపాక్)ను దేశంలోనే అత్యంత చెత్త వేదికగా పేర్కొన్నాడు. ఒకప్పుడు తను కూడా ఇదే చెన్నై జట్టుకు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. తన ర్యాంకింగ్స్‌లో దానికి చివరి స్థానం ఇవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. సాధారణంగా చెపాక్ స్టేడియం స్పిన్నర్లకు అనుకూలంగా ఉండి, తక్కువ స్కోర్లు నమోదయ్యే వేదికగా పేరుగాంచింది. అయితే ఓ స్టార్ పేసర్‌గా హేజిల్‌వుడ్‌కు అక్కడి పరిస్థితులు ఏమాత్రం నచ్చలేదని



స్పష్టమవుతోంది. "బ్లైండ్ ర్యాంకింగ్" ప్రక్రియలో భాగంగా స్టేడియాల పేర్లు అడగగా.. చెన్నై మైదానాన్ని అతను ఏమాత్రం సంకోచించకుండా పదో స్థానంలో (చివరి స్థానం) ఉంచాడు. స్పిన్ మాయాజాలం ఎక్కువగా ఉండే ఈ పిచ్‌పై పేసర్లకు పెద్దగా పని ఉండకపోవడమే ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. మరోవైపు బ్యాటర్లకు స్వర్గధామంగా, బౌలర్లకు పీడకలగా భావించే బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియాన్ని హేజిల్‌వుడ్ తన ఫేవరెట్ వేదికగా మొదటి స్థానంలో నిలిపాడు. చిన్నస్వామి స్టేడియంలో బౌండరీలు చాలా దగ్గరగా ఉన్నప్పటికీ.. అక్కడి దక్కన్ నేల అందించే అదనపు బౌన్స్ తనలాంటి పొడవైన బౌలర్లకు వికెట్లు తీయడానికి ఎంతో సహకరిస్తుందని హేజిల్‌వుడ్ వివరించాడు. తన టాప్-3 జాబితాలో చిన్నస్వామితో పాటు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం, ముంబైలోని వాంఖడే స్టేడియాలను చేర్చడం గమనార్హం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. పేసర్లకు అత్యంత అనుకూలంగా ఉండే ధర్మశాల, కోల్‌కతా (ఈడెన్ గార్డెన్స్), లక్నో (ఎకానా) వంటి స్టేడియాలను హేజిల్‌వుడ్ తన జాబితాలో కింది స్థానాల్లో ఉంచాడు. ఇటీవల ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నాలుగు వికెట్లు తీసి ఆర్సీబీ విజయంలో కీలక పాత్ర పోషించినప్పటికీ.. ఆ మైదానానికి కేవలం 9వ ర్యాంక్ మాత్రమే ఇచ్చాడు. గాయం నుంచి కోలుకుని అద్భుత ఫామ్‌లో ఉన్న హేజిల్‌వుడ్.. ధోనీ కోటపై చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సీఎస్కే, ఆర్సీబీ అభిమానుల మధ్య పెద్ద చర్చకు దారితీశాయి.

# స్పోర్ట్స్

## సూర్యవంశీపై గవాస్కర్ ప్రశంసల వర్షం



ఐపీఎల్ 2026 సీజన్లో రాజస్థాన్ రాయల్స్ యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. మంగళవారం పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 16 బంతుల్లో 5 సిక్సర్లు, 3 ఫోర్లతో 43 పరుగులు చేసిన వైభవ్ సూర్యవంశీ.. ఈ సీజన్లో 400 పరుగుల మైలురాయిని అందుకున్న తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో కేవలం 167 బంతుల్లోనే 400 పరుగులు పూర్తి చేసి.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగంగా (238.09 స్ట్రైక్ రేట్‌తో) ఈ ఘనత సాధించిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆడుతున్న తీరుపై టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. "వైభవ్ కొడుతున్న షాట్లు అద్భుతం. అతని కోసం బౌండరీ లైన్ వద్ద 10 మంది ఫీల్డర్లను పెట్టినా ఆపడం అసాధ్యం. అతను దేనికీ భయపడటం లేదు. ఇంత చిన్న వయసులో ఉండటం వల్ల వచ్చే ప్రయోజనం అదే కాబోలు. ఎదురుగా ఉన్నది ఏ బౌలర్ లేదా ఏ జట్టు అని అతను ఆలోచించడం లేదు, కేవలం బంతిని మాత్రమే చూస్తున్నాడు" అని కొనియాడారు. వైభవ్ దూకుడు ఐపీఎల్‌లోని మిగిలిన జట్లకు పెద్ద సవాల్‌గా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో వైభవ్ సూర్యవంశీ ఇచ్చిన ఆరంభం ఎంతో కీలకంగా మారింది. పంజాబ్ స్టార్ పేసర్ అర్షదీప్ సింగ్ వేసిన తొలి ఓవర్‌లోనే 6, 4, 4 బాది వైభవ్ సూర్యవంశీ తన ఉద్దేశాన్ని చాటాడు. లాకీ ఫెర్గూసన్, మార్కో జాన్సెన్ వంటి మేటి బౌలర్లను కూడా లెక్కచేయకుండా భారీ సిక్సర్లు బాదాడు. కేవలం 3.2 ఓవర్లలోనే రాజస్థాన్ 50 పరుగుల మార్కును దాటడం వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసానికి నిదర్శనం. చివరికి డోనోవన్ ఫెరీరా, శుభమ్ దూబే అద్భుతమైన పోరాటంతో రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. యశస్వి జైస్వాల్ (51), రియాన్ పరాగ్ (29) కూడా రాణించడంతో పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో తమ మొదటి ఓటమిని చవిచూసింది. వైభవ్ సూర్యవంశీ కేవలం 15 ఏళ్ల వయసులోనే దిగ్గజాల ప్రశంసలు అందుకోవడమే కాకుండా, పరుగుల వేటలో అగ్రస్థానంలో కొనసాగుతుండటం విశేషం.